వారింట్లోని వినాయకుడు, వెంకటేశ్వరస్వామిల ఫొటోలని చూసి వారెవరని అడిగింది ఓల్గా. ఓల్గాకి దేవుడి గురించి ఏమీ తెలీదని క్రమంగా గ్రహించాడా పెద్ద మనిషి. ఏ పండుగ గురించి కూడా తెలీదు ఓల్గాకి. శ్రీరామనవమికి ఆయన ఓల్గాని దగ్గరలోనే వున్న ఓ దేవాలయానికి తీసుకెళ్ళి శ్రీరామచంద్రుడి విగ్రహం చూపించి చెప్పాడు.

"ఆయనెవరో తెలుసా? ఇంకో దేవుడు."

"తెలుసు." చెప్పింది ఓల్గా.

"ఇంతదాకా నిన్నీ గుడికి తీసుకురాలేదుగా? అయినా నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఆయన.

"మా అమ్మ, నాన్న చచ్చిపోయాక నేను రోడ్డు పక్కన కూర్చుని ఏడుస్తూంటే, పోలీసులు వచ్చేదాకా నన్ను ఎత్తుకుని ఆడించింది ఆయనే కదా." జవాబు చెప్పింది ఓల్గా.

## 42. ధనవంతురాలు

శైలజ ఓ మధ్యతరగతి వుద్యోగి భార్య. ఆయనకి వచ్చే జీతం వారి సంసారం గడపడానికి బొటాబొటిగా సరిపోతుంది. ఆమెకి ఎన్నో కోరికలు. డివిడి ప్లేయర్, కంప్యూటర్, పెద్ద కలర్ టి.వి, ప్రతీ వేసవిలో ఊటీకి వెళ్ళి సెలవులు గడపాలన్న కోరిక, యింకా ఎన్నెన్నో కోరికలు ఆమెకున్నాయి.

అయితే వారి కుటుంబ కనీస అవసరాలకి డబ్బు ఖర్చయ్యాక ఆ కోరికలు తీర్చుకోడానికి ఇంకేమీ మిగలదు. తన బీదతనానికి ఆమె ఎంతో బాధపడుతూ ఉంటుంది. తమ పేదతనం తొలగించమని నిత్యం ఆమె శ్రద్ధగా లలితా సహస్రనామ పారాయణం పూర్తిచేసి కాని భోజనం ముట్టదు.

ఆ రోజు ఉదయం నించి బాగా వర్షం పడుతోంది. పారాయణం, నైవేద్యం అయాక కంచంలో అన్నం వడ్డించుకుంది. మొదటి ముద్ద నోట్లో

పెట్టుకోబోతూంటే ఎవరో తలుపు తట్టిన చప్పుడైంది. ఆమె వెంటనే లేచి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా భుజాన మాసిపోయిన సంచీలతో, పాత కాగితాలు ఏరుకునే ఇద్దరు చిన్నపిల్లలు నిలబడి వున్నారు.

మంచినీళ్ళు అడిగారు వాళ్ళు. గాజు గ్లాసుల్లో వాళ్ళిద్దరికీ శైలజ మంచినీళ్ళిచ్చింది. నీళ్ళు తాగాక అడిగాడు వాళ్ళలో ఒకడు.

"ఏమండి. మీరు బాగా డబ్బున్నవారా?"

"కాదు. ఎందుకలా అనుకున్నావు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అన్నంలోకి మీకు పప్పు, కూర, పచ్చడి, పులుసు ఇంకా పెరుగు కూడా వున్నాయి. మాకు మజ్జిగ తప్ప ఇంకేం వుండవు."

"మా అన్నం మీ అన్నమంత తెల్లగా కూడా ఉండదు. పురుగులుంటాయ్." చెప్పాడు రెండోవాడు.

శైలజ తక్షణమే వాళ్ళని లోపలికి ఆహ్వానించింది. తన కంచంలో వడ్డించుకున్న అన్నాన్ని ఆ ఇద్దరు పిల్లలకి పెట్టింది. వాళ్ళు ఆత్రంగా, తృప్తిగా తిన్నారు.

వాళ్ళు వెళ్ళాక శైలజ లలితామ్మవారి ఫోటో ముందు సాష్టాంగపడి డగ్గుత్తికగా చెప్పింది.

"తల్లీ! నన్ను ధనవంతురాలిని చేయమని ఎంతకాలంగానో నిన్ను కోరుతున్నాను. నేనెంత ఐశ్వర్యవంతురాలినో తెలియచేసి నా కోరికని తీర్చావు. ఇవాళ నా కళ్ళు తెరిపించావు."

భోజనం మానేసి ఆమె చాలాసేపు ఆనందంగా పారాయణం కొనసాగించింది.

సాయంత్రం శైలజ భర్త ఆఫీసు నించి ఇంటికి వచ్చాక, ముందుగదిలో నేలమీద వున్న ఆ పిల్లల బురద కాళ్ళ ముద్రలని చూసి అడిగాడు.

"ఎవరివి ఇవి? వెంటనే వీటిని తుడిచి శుభ్రం చెయ్యి."

"మనమెంత ధనవంతులమో మర్చిపోకూడదని కావాలనే వాటినలా వుంచానండి." చెప్పింది శైలజ.

## 43. మూర్ఖుడి పని

ఒక ఊళ్ళో ఓ పేరుమోసిన రౌడి ఉన్నాడు. అతను దుకాణదారులని, ధనవంతులని బెదిరించి ధనార్జన చేయసాగాడు. ప్రాణభయంతో ఎవరూ అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ముందుకి రాలేదు. ఎందుకంటే అతను హంతకుడు కూడా. దాంతో చట్టం అతన్ని ఏం చెయ్యలేకపోయింది. పోలీసులు కూడా నిస్సహాయులై పోయారు.

ఈ పరిస్థితుల్లో ఆ ఊరికి ఓ సద్గురువు వచ్చాడు. ఆయన తనతో తెచ్చుకున్న బంగారు పెట్టెలో ఆయన నిత్యం పూజించే దేవతా విగ్రహాలున్నాయి. అవి వజ్రాలు పొదిగినవి.

ఆ సద్గురువు విలువైన బంగారు విగ్రహాలతో తమ వూరు వచ్చిన సంగతి ఆ రౌడీ చెవులబడింది. వాటి మీద అతనికి ఆశ కలగడంతో వాటిని ఎలాగైనా చేజిక్కించుకోవాలని అనుకున్నాడు.

ఓరోజు కత్తి పట్టుకుని సరాసరి రౌడి ఆ సద్గురువు బస చేసిన నివాసానికి వెళ్ళాడు. బంగారు పెట్టెలోని విగ్రహాలు ఇవ్వమని లేదా చంపేస్తానని ఆయన్ని బెదిరించాడు.

ఆయన ఏ మాత్రం భయపడకుండా చిరునవ్వుతో చెప్పాడు.

"నువు కోరినట్లుగానే ఇస్తాను. కాని ముందు నా ప్రశ్నలకి జవాబు చెప్పు చాలు."

"అలాగే. అవేమిటో తొందరగా అడుగు." అయిష్టంగా ఒప్పుకున్నాడు రౌడి.